




# టీటీడీ బోర్డులో ముగ్గురికి స్థానం

- చిత్తూరు, తిరుపతి జిల్లాలనుంచి చైర్మన్‌గా బీఆర్ నాయుడు, సభ్యులుగా పనబాక లక్ష్మి, వైద్యం శాంతారాం
- పండుగ పూట ఆశావహులకు తీవ్ర నిరాశ



బీఆర్ నాయుడు



పనబాక లక్ష్మి



శాంతారాం

తిరుపతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానాలకు పాలకమండలిని రాష్ట్రప్రభుత్వం ఖరారు చేసింది. అందులో ఛైర్మన్ సహా ముగ్గురికి చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచీ స్థానం లభించింది. ఛైర్మన్‌గా టీవీ5 ఛానల్ ఛైర్మన్ బీఆర్ నాయుడు పేరు ఖరారు కాగా సభ్యులుగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వైద్యం శాంతారామ్ ఖరారయ్యారు.వీరిలో బొల్లినేని రాజగోపాల నాయుడు అలియాస్ బీఆర్ నాయుడు చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని మారుమూల గ్రామమైన దిగువపూనేపల్లికి చెందిన వారు. చాలాకాలం క్రితమే ఆయన కుటుంబం హైదరాబాదులో స్థిరపడింది. ఇక సభ్యులుగా పదవి పొందిన కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి గతంలో నెల్లూరు నుంచీ మూడు సార్లు, బాపట్ల నుంచీ ఒకసారి ఎంపీగా గెలిచారు. 2004-09, 2009-14 నడుమ వైద్య, జౌళి, పెట్రోలియం శాఖలకు సహాయ మంత్రిగా పనిచేశారు. 2019లో టీడీపీలో చేరిన ఆమె ఆ ఏడాది సాధారణ ఎన్నికల్లోనూ, 2021లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ తిరుపతి నుంచీ ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేశారు. ప్రస్తుతం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జిగా వున్నారు. ఇక వైద్యం శాంతారామ్ కుప్పం టీడీపీ ఇంఛార్జి పి.ఎస్.మునిరత్నం ముఖ్య అనుచరుడు. 2003లో టీడీపీకి అనుబంధంగా నాయీ బ్రాహ్మణ సేవాసంఘాన్ని కుప్పంలో ఏర్పాటు చేశారు.టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ,నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. **రాష్ట్రస్థాయిలో పర్యటిస్తూ నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం ఉన్నతికి కృషి చేయడమే కాకుండా, పార్టీ పటిష్ఠతకు పాటుపడ్డారు.**

## కూటమి పార్టీల శ్రేణుల్లో మిశ్రమ స్పందన

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎప్పుడెప్పుడా అని ఆయాపార్టీ వర్గాలు ఎదురు చూసిన టీటీడీ పాలకమండలి ఎట్టకేలకు ఖరారైంది. అయితే పదవుల కేటాయింపు పట్ల మూడు పార్టీల శ్రేణుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఇప్పటికే నాలుగు నెలలు గడిచిపోయిన నేపధ్యంలో ఇప్పటికైనా పాలకమండలిని ఖరారు చేయడం మంచిదేనని మెజారిటీ శ్రేణులు భావిస్తున్నాయి.అయితే పలువురు ఆశావహులు మాత్రం నిరాశకు లోనవుతున్నారు. ముఖ్యంగా దీపావళి పండుగ పూట ప్రభుత్వం టీటీడీ పాలకమండలిని ఖరారు చేయడం పదవులు పొందిన వారికి మోదం కలిగించగా అవకాశం దక్కని వారికి ఖేదం మిగిల్చింది. తిరుపతి నుంచీ టీడీపీ పార్లమెంటు కమిటీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, చంద్రగిరి టీడీపీ నేత హేమాంబరధర నాయుడు, జనసేన నుంచీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఇంఛార్జి కిరణ్ రాయల్, బీజేపీ నుంచీ భానుప్రకాష్‌రెడ్డి తదితరుల పేర్లు టీటీడీ పాలకమండలి పదవుల కోసం ప్రముఖంగా వినిపించాయి. అయితే ఖరారైన జాబితాలో ఇందులో ఒక్క పేరు కూడా కనిపించలేదు.ఎన్టీయార్ కుటుంబాన్ని నమ్ముకోవడంతో పాటు టీడీపీలో కష్టపడి పనిచేసే నేతగా పేరున్న శ్రీధర్ వర్మ గత టీడీపీ ప్రభుత్వంలో అవకాశం తప్పిపోగా ఈ పర్యాయమైనా అవకాశం దక్కుతుందని ఆశించారు. అతనితో పాటు మిగిలిన ఆశావహులకు కూడా ప్రత్యామ్నాయంగా ఏదో ఒక పదవి దక్కే అవకాశాలు లేకపోలేదు. టీటీడీ బోర్డులోనే ప్రత్యేక ఆహ్వానితులుగా కొందరిని నియమించే అవకాశముంది. అలాగే తుడ ఛైర్మన్ టీటీడీ బోర్డులో ఎక్స్ అఫిషియో మెంబరుగా కొనసాగేందుకూ వీలుంది.అందులోనైనా ఛాన్సు దొరక్కపోతుందా అని ఆశావహులు తమను తాము ఊరడించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక ఆహ్వానితులు, తుడా ఛైర్మన్‌కు ఎక్స్ అఫిషియో సభ్యత్వం, తిరుపతి ఎమ్మెల్యేకి స్పెషల్ ఇన్వైటీ హోదా లేదా ఎక్స్ అఫిషియో సభ్యత్వం వంటి అంశాలపై నెలకొన్న అస్పష్టత ప్రభుత్వ జీవో జారీతో తొలగిపోనుంది.

## నవోదయలో ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంపు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):నవోదయ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి 9వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశ దరఖాస్తు గడువు బుధవారంతో ముగియగా, దీన్ని నవంబరు 9వ తేదీ వరకు పొడిగించినట్లు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ వేలాయుధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఇతర వివరాలకు లక్ష్మీనారాయణ-89199 56395, పి.జగదీష్ కుమార్-70132 01138 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



# వర్షపు నీటిలో టపాసుల దుకాణాలు

- అధికారులు సౌకర్యాలు కల్పించక నష్టపోయామంటున్న వ్యాపారులు



వర్షానికి తడిసిపోయిన టపాసులు



కరెంటు లేక చీకట్లోనే దుకాణాలు



దుకాణాల ముందు వర్షపునీరు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):అసలే ఊరికి దూరం....పైగా సౌకర్యాల లేమి..వెరసి చిత్తూరులో ఈసారి టపాకాయల వ్యాపారులకు నష్టాలు మిగిల్చాయి. కొన్నేళ్లుగా ఇస్తోన్న మార్కెట్‌యార్డును కాదని ఈసారి నగర శివారులోని మురకంబట్టు బైపాస్ రోడ్డులో తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. మార్కెట్‌యార్డులో అయితే పర్మినెంటు షెడ్లు, కరెంటు వసతి ఉండేది. వర్షం వచ్చినా వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు కాదు.ఈ ఏడాది బైపాస్ రోడ్డులో దుకాణాలకు అనుమతి ఇవ్వడంతో వ్యాపారులే తాత్కాలిక షామియానాలు, షెడ్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ సరఫరా తీసుకున్నారు.వివిధ శాఖలకు ఇచ్చిన మామూళ్లతో కలిపి ఒక్కో షాపునకు రూ. 2లక్షల వరకు ఖర్చు పెట్టుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తోడు అదంతా లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపునీరంతా దుకాణాల్లోకి చేరింది. నడవటానికి కూడా వీలు లేనంతగా బురద ఏర్పడడంతో జనం అడుగుపెట్టలేకపోయారు. దానికి తోడు వర్షం కురుస్తూనే ఉండటంతో టపాసుల కొనుగోలుకు జనం పెద్దగా రాలేకపోయారు. విద్యుత్ సరఫరా కోసం ప్రతి దుకాణదారు రూ. 20వేలు చెల్లించారు. అయితే వర్షం కారణంగా సరఫరా నిలిపివేయడంతో దుకాణసముదాయమంతా చీకటిమయంగా తయారైంది.సరైన వసతి ఏర్పాట్లను కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలంకావడంతో నిండామునిగామని వ్యాపారులు చెబుతున్నారు.

## రేపట్నుంచి పింఛన్ల పంపిణీ

- రూ.113.43 కోట్ల విడుదల

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ జరగనుంది. జిల్లాలోని 2,68,820 పింఛన్‌దారులకు సంబధించి రూ.113.43 కోట్లు నిధులు జిల్లాకు చేరాయి. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

## ఎస్ఎన్‌జే షుగర్స్‌లో సీఐడీ సోదాలు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 30: శ్రీరంగరాజపురం మండలం నెలవాయిలో ఉన్న ఎస్ఎన్‌జే షుగరు ఫ్యాక్టరీ డిక్లనరీలో బుధవారం సీఐడీ డీఎస్పీ పద్మలత నేతృత్వంలో 15మంది సభ్యులు తనిఖీలు నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

## రేపు గుడిపాలలో ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ప్రారంభ కార్యక్రమం శుక్రవారం గుడిపాల మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జేసీ విద్యాధరి తెలిపారు. బుధవారం గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి హాజరవుతారన్నారు.డీఎస్వో శంకరన్, సివిల్ సప్లయిస్ డీఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

## నీవానదిలో ఇసుక తవ్వకాలపై ఆరా



నీవానదిలో గుంతలను మొబైల్‌ఫోన్లలో చిత్రీకరిస్తున్న ఎన్జీటీ, పీసీబీ అధికారులు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నీవానది యేటిలో ఇసుకను తవ్వి తరలించడంతో ఏర్పడ్డ గుంతలను అధికారులు బుధవారం పరిశీలించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో గంగాధరనెల్లూరు మండలం కొత్రకోన , ముక్కలత్తూరు, ఎల్లాపల్లె పంచాయతీల్లోని రీచుల్లో కాంట్రాక్టర్లు ఇసుకను ఎంతలోతులో తవ్వి తరలించేశారు, దానివల్ల పర్యావరణానికి ఏ మాత్రం ముప్పువాటిల్లిందనే విషయాలను స్థానిక అధికారులతో కలిసి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులు పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాసులు, జియాలజిస్ట్ పోలురెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ విషాద ఘటనకు 15 ఏళ్లు



చేదు జ్ఞాపకం

వెదురుకుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి వస్తే అందరి ఇళ్లలో ఆనందపు వెలుగులే. అయితే సరిగ్గా 15 ఏళ్ల క్రితం చిత్తూరు జిల్లా సరిహద్దులోని పళ్లిపట్టులో దీపావళి రోజు జరిగిన ఘటన కొందరి ఇళ్లలో చీకటి నింపింది.ఇప్పటికీ దీపావళి వచ్చిందంటే ఆ కుటుంబాలతో పాటు వారి బంధువులు, స్నేహితులు కూడా ఆ దుర్ఘటనను గుర్తు చేసుకుని బాధపడుతుంటారు.తమిళనాడులోని పళ్లిపట్టు టపాసులకు ప్రసిద్ధి. చౌకగా దొరుకుతాయని అక్కడికి చిత్తూరు జిల్లావాసులు కూడా వెళ్తుంటారు.2009వ సంవత్సరం అక్టోబరు 16వ తేది రాత్రి పళ్లిపట్టు టపాసుల గోడౌన్‌లో కొనుగోలుదారులు అధిక సంఖ్యలో ఉండగా అగ్నిప్రమాదం జరిగింది. దీంతో టపాసులు, నల్లమందు పేలి మంటలు వ్యాపించాయి.ఈ ఘటనలో 32 మంది మరణించారు. వీరిలో కార్వేటినగరం మండలానికి చెందిన ఆరుగురు, ఎస్ఆర్‌పురం, పుత్తూరు తదితర ప్రాంతాలకు చెందిన 12మంది చనిపోయారు.


ఆదిమానవుడు చిత్రీకరించిన రేఖాచిత్రాలు

# అపురూపాలు ఆదిమానవుడి రేఖాచిత్రాలు




**25వేల ఏళ్ల నాటి ఆదిమానవుని ఆనవాళ్లు ● చింతకుంట కొండలో పెరుగుతున్న సందర్శకుల సందడి**
**రక్షణ కల్పించలేని పర్యాటక, పురావస్తు శాఖలు ● రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలంటున్న పర్యాటకులు**

ముద్దనూరు,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో అరుదైన, అపురూపమైన ఆదిమానవుడి రేఖా చిత్రాలు కడప జిల్లా ముద్దనూరు మండలం చింతకుంట కొండలో కనువిందు చేస్తున్నాయి. 25 వేల ఏళ్ల కిందట ఇక్కడ మానవులు ఆవాసం ఏర్పరచుకున్నారని, జీవించారని, కొండపై చిత్రించిన రేఖా చిత్రాలు ఆధారభూతమై నిలుస్తున్నాయి. ఇక్కడి వాతావరణం, నీరు, ఆహారం పుష్కలంగా ఉండడంతో ఆదిమానవుడు ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని నివసించి ఉంటారని దాదాపు 200 రేఖాచిత్రాలను తిలకించిన మేధావులు అభిప్రాయపడుతున్నారు. వీరు ఏర్పాటు చేసుకున్న నివాస ప్రదేశాల ఆచూకీ తెలుసుకునేందుకు అనువుగా అక్కడక్కడా ఎరుపు రంగు ఆకుపసరుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆదిమానవడు దాదాపు 12 అడుగుల ఎత్తు ఉండవచ్చని, కొండలో ఇంకా గాలిస్తే ఎన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని అంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఆదిమానవుడి ఆనవాళ్లు మరెన్నో గుర్తించవచ్చు. నాటి చరిత్ర, నేటి యువతరానికి ప్రతీకలు, శతాబ్దాలు దాటిన ప్రతి ఆనవాళ్లు చరిత్రకు ప్రతీకగా, అపురూపంగా భావించి, వాటి అభివృద్ధి, రక్షణ కోసం పర్యాటక, పురావస్తు శాఖలను ఏర్పాటు చేశారు. కోతి ద్వారా ఆదిమానవుడు రూపాంతరం చెందుతూ నేడు మనిషిగా మనుగడ కొనసాగిస్తున్నాడు. అటువంటి ఎంతో పురాతన చరిత్ర కలిగిన 25వేల ఏళ్ల నాటి ఆదిమానవుడి ఆనవాళ్లు ఉన్న రేఖాచిత్రాలను, తిలకించేందుకు వచ్చే సందర్శకులకు చింతకుంట కొండలో రక్షణ కరువైందన్న విమర్శలు వస్తున్నాయి.

చింతకుంట పంచాయతీలోని కొండలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. కొండపై నెలకొన్న కోనలింగేశ్వరస్వామి(శివాలయం), సమీపంలోనే 1909 బ్రిటీషర్లు ఏర్పాటు చేసిన విశాలమైన జలాశయాన్ని తలపిస్తున్న చింతకుంట చెరువు. ఈప్రదేశంలో నెలకొన్న ప్రతి ఒక్కటీ చరిత్రను సృష్టిస్తున్నాయి. 2010 ఆగస్టు 17న అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్, వివేకవర్ధిని జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు పుల్లారెడ్డి, కడప ఇన్‌టాక్ లైఫ్‌మెంబర్, అప్పటి జిల్లా కన్వీనర్ సీతారామయ్య, అప్పటి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి సత్యం కొందరు పత్రికా విలేకరుల సహకారంతో ఆది మానవుడి ఆనవాళ్ల కోసం కొండలో గాలించి ఆదిమానవుడి రేఖాచిత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఎద్దుల ఆవులగుండు, గొడుగుగుండు, చిన్నావిడగుండు, పెద్దావిడ గుండు, మారెమ్మగుండు, గనంగుండు, మబ్బుగుండు, చిలకలోల్లగుండు ఇంకా ఎన్నో గుండ్ల పై ఆదిమానవుడు నాటి నాగరికత, పనిముట్లు, జంతువుల రేఖాచిత్రాలను కొండరాళ్లకు ఆకుపసరుతో నేటి యుగానికి కనువిందు చేసేలా చిత్రించాడు. ఏనుగు, జింక, దుప్పి, నక్క, కుందేలు, పక్షులు, ఎద్దు, విల్లంబులు ఎక్కుపెట్టిన మానవాకృతులు, అప్పటి వేటకు ఉపయోగించే పనిముట్లు, లైంగిక చిత్రాలు, దాదాపు 200 రేఖాచిత్రాలు కనిపిస్తాయి. ఈరేఖాచిత్రాలను తిలకించిన మేధావులు ఆది మానవుడు నివాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని ఆవాసం ఏర్పరచుకుని ఉంటారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆది మానవులు ఎక్కువ సంఖ్యలో ఉండి వుంటారని తెలుస్తోంది. అంతే కాకుండా ఇక్కడ వారి నివాసాలను గుర్తించేందుకు అనువుగా ఎరుపు రంగుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా వారు మరణిస్తే మృతదేహం పట్టేలా రాతి గుండును మలిచి మృతదేహాన్ని దానిలో పడుకోబెట్టి సీసంతో నింపి అంత్యక్రియలు చేసేవారని వివరిస్తున్నారు. ఈప్రదేశంలో అటువంటి శ్మశానవాటిక ఉండవచ్చని వెదికితే గుర్తించవచ్చని అంటున్నారు. కొండలో గాలిస్తే మరెన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని, ఇటువంటి వాటిని గుర్తించి వాటిని భద్రపరిస్తే చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తాయని అంటున్నారు. రేఖాచిత్రాలు వెలుగు చూసిన తరువాత ఈ ప్రదేశాన్ని ఎందరో సందర్శనార్థం వస్తున్నారు. కొండపైకి వెళ్లాలంటే దారి సరిగాలేక పోవడంతో 2010లో ఉపాధి పథకంలో భాగంగా పర్యాటకుల కోసం అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్ గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేయించారు. 2010 ఆగస్టు24న అప్పటి డీపీఆర్‌ఓ ప్రసాద్, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్లు సాంబశివారెడ్డి, రామబ్రహ్మం విద్యార్థులతో కలిసి సందర్శించారు. తరువాత 2011 ఫిబ్రవరి19న అప్పటి డీపీఆర్‌ఓ గోపాల కొండలోని అన్ని గుండ్లకు ఉన్న రేఖా చిత్రాలను సందర్శించారు. అప్పట్లో జమ్మలమడుగు న్యాయమూర్తి, న్యాయవాదులు, ఆర్టీపీపీ ఉద్యోగులు రేఖాచిత్రాలను సందర్శించారు. మనరాష్ట్రం విద్యార్థులే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి విద్యార్థులు సందర్శనార్థం వస్తూనే వున్నారు. ఆతర్వాత 6వతరగతి సాంఘిక శాస్త్రంలో ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు పాఠ్యాంశంలో రచయిత, ప్రస్తుతం సంబేపల్లె హెచ్ఎం మడితాటి నరసింహారెడ్డి పొందుపరిచారు. దీంతో ఈ ప్రదేశంపై రాష్ట్ర విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగింది. ఎంతో చరిత్ర కలిగిన ఆదిమానవుడి రేఖాచిత్రాలకు పర్యాటక, పురావస్తు శాఖ వారు రక్షణ కల్పించలేక పోతున్నారు. అప్పట్లో సందర్శనార్థం వచ్చిన కడప అక్షర పాఠశాల విద్యార్థులపై తేనెటీగల దాడి చేశాయి. అయినా అధికారులు స్పందించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా సందర్శకులకు రక్షణ కల్పించవలసిన అవసరం ఎంతైనా వుంది.



## మామిడి రైతులకు శిక్షణ


మాట్లాడుతున్న ఉద్యానవనశాఖాధికారి

రొంపిచెర్ల, అక్టోబరు30: (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులు తమ తోటలను ఇతరులకు అమ్మి దళారులతో నష్టపోవద్దన్నారు. రైతులు పాటించవలసిన సస్యరక్షణ చర్యలు తెలియజేశారు. ఒకే రకం పురుగుల మందులు పలు పర్యాయాలు వాడరాదని, కాయలకు కంటే కవర్లు రాయితీపై ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త పీర్‌సాహెబ్, ఉద్యాన వన అధికారి సంతోషికుమారి, నరసింహులు పాల్గొన్నారు.

## కుప్పంలో టీడీపీ సభ్యత్వ నమోదు


కుప్పం 12వ వార్డులో సభ్యత్వ నమోదులో రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు సభ్యత్వ నమోదును తమ బాధ్యతగా తీసుకుని పనిచేయాలని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యేంద్రశేఖర్‌లు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో బుధవారం వారు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానికులు పలువురికి సభ్యత్వం ఇచ్చారు కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, వార్డ్ ఇన్‌ఛార్జి రవి, బూత్ ఇన్‌ఛార్జి ప్రకాశ్, ఇర్ఫాన్, నబి, గని, భాస్కర్, మునెప్ప పాల్గొన్నారు.

## ముగిసిన ఉపాధ్యాయుల వర్క్‌షాప్


మాట్లాడుతున్న పీఎస్‌ఎం మునిరత్నం

శాంతిపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కూతేగానిపల్లెలోని పరమహంస యోగానంద విద్యాలయంలో ఉపాధ్యాయులకు హబ్ అండ్ స్పోక్‌పై మూడు రోజులుగా నిర్వహించిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ముగింపు సమావేశంలో వక్తలు అటల్ ల్యాబ్ విస్తరణ, ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల హెచ్ఓడీ డా. సీఎన్ కోదండరామయ్య, పరమహంస యోగానంద విద్యాలయం ఛైర్మన్ గోపాల్ జీఅగర్వాల్, ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్, పలువురు శిక్షకులు పాల్గొన్నారు.

## గడ్డూరులో తీరిన తాగునీటి సమస్య

రామకుప్పం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గడ్డూరు గ్రామంలో తాగునీటి సమస్య తీరింది. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డితోపాటు స్థానిక నేతలు గడ్డూరులో తాగునీటి సమస్యను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు తెలిపారు. ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో గ్రామంలో ఇటీవల బోరు తవ్వకం జరిగింది. బుధవారం ఆ బోరుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథరెడ్డిలు కూటమి నేతల సమక్షంలో పైపులు, మోటారు అమర్చారు.



### సీఎంకు విరాళం అందజేత

సీఎం చంద్రబాబును విజయవాడలోని ఆయన నివాసంలో కలిసినట్టు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. వరద బాధితుల కోసం తాము సేకరించిన విరాళాల మొత్తం రూ.14,36,000 చెక్కును సీఎంకు అందజేసినట్టు ఆయన తెలిపారు. - శాంతిపురం

## తిరుమలలో వర్షం..భక్తుల ఇబ్బందులు


ఆలయం ముందు వర్షం, వాహనమండపం కిందకు చేరిక భక్తులు, ఆలయం ముందు తడుస్తూ..

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం వర్షం కురిసింది. ఉదయం గంట పాటు భారీగా కురిసిన వర్షం ఆ తర్వాత నిలిచిపోయింది. సాయంత్రం వరకు ఎండ భారీగా ఉన్నప్పటికీ మళ్లీ గంట పాటు వర్షం పడింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు అకాల వర్షంతో ఇబ్బంది పడ్డారు. దర్శనానికి వెళ్లేవారితో పాటు దర్శనం చేసుకుని బయటకు వచ్చేవారు కూడా తడిసిపోయారు. మరికొంతమంది వర్షం నిలిచేవరకు షెడ్లు, కార్యాలయాలు, మండపాలు, చెట్ల కింద నిలబడ్డారు. ఇంకొందరు తమ వద్దనున్న వస్త్రాలు, లడ్డూ కవర్లు, అట్టపెట్టెలు తలపై అడ్డుగా పెట్టుకుని పరుగులు తీస్తూ కనిపించారు. కొద్దిపాటి వర్షానికే ఆలయ ప్రాంతం తడిసి ముద్దయింది.

## బాంబు బెదిరింపులంతా ఫేక్ మెయిల్సే : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కొన్ని హోటళ్లు, ఆలయాలకు వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్ ఫేక్‌వని, దీనికి ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. బాంబు బెదిరింపు మెయిల్స్‌పై ప్రత్యేక సైబర్ టీం, ఐటీ కోర్ సహా ఇతర విభాగాలతో దర్యాప్తు చేయిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి భద్రత కూడా పెంచామన్నారు. ఏ చిన్న అనుమానం వచ్చినా, అనుమానాస్పద వస్తువులు కనపడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బెదిరింపులు వచ్చిన అన్ని హోటళ్లు, ఇతర ప్రదేశాల్లోనూ నిరంతరం తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. బెదిరింపు మెయిల్స్‌పై కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థల సహకారంతో దర్యాప్తు వేగవంతంగా చేస్తున్నామన్నారు. పటిష్ఠ పోలీసు వ్యవస్థతో తిరుపతి, తిరుమల సేఫ్ జోన్‌లో ఉన్నాయన్నారు. కాగా, ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## శ్రీవారి సేవలో రేవంత్‌రెడ్డి కుటుంబం


రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రదీప్ మాచిరాజు

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఉదయం జరిగిన అర్చన సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీత, కుమార్తె నైమిషారెడ్డి, అల్లుడు సత్యానారాయణరెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సినీనటి ప్రేమ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

### స్వామి ఆశీస్సుల కోసం వచ్చా

తాను హీరోగా నటిస్తున్న 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రానికి అందరి ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానని హీరో ప్రదీప్ మాచిరాజు కోరారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు.

## బాల్ బ్యాడ్మింటన్ విజేత ఎస్వీయూ కాలేజీ జట్టు


విజేత జట్టుకు ట్రోఫీ, షీల్డ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఇంటర్ కాలేజీ మెన్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం బాల్ బ్యాడ్మింటన్‌లో ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ రన్నరప్‌గా నిలిచింది. బాస్కెట్‌బాల్ విజేతగా విజయం డిగ్రీ కాలేజీ (చిత్తూరు), వీసీఆర్ కాలేజీ(చిత్తూరు) జట్టు రన్నరప్‌గా నిలిచాయి. హ్యాండ్‌బాల్లో సీకాం డిగ్రీ కాలేజీ(తిరుపతి)విజయం సాధించగా, బీఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ(తిరుపతి) జట్టు రెండో స్థానానికి పరిమితమైంది. మదనపల్లె బీటీ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి విజేతలకు ట్రోఫీ, షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. దీంతో టోర్నమెంట్ ముగిసింది.

## తిరుపతి డీఆర్వో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా నరసింహులు బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు గోదావరి జిల్లా డీఆర్వోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఉన్న పెంచలకిషోర్‌ను రాష్ట్ర ప్రభుత్వం జేఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో తిరుపతి ఆర్డీవోగా పని చేశానని, ఆ అనుభవంతో అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## కుప్పం ఆర్టీసీ డీఎంగా గోపీనాథ్


డీఎంను సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

కుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపో మేనేజరుగా సి.గోపీనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంసీ.పెంచలయ్య వాకాడు డీఎంగా బదిలీ అయ్యారు. నూతన డీఎం గోపీనాథ్‌ను ఎన్ఎంయూఏ నాయకులు సత్కరించారు. ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు వేలు, ఉపాధ్యక్షుడు మొగిలీశ్వరయ్య, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్, డిపో అధ్యక్షుడు ఎస్.మునస్వామి, కార్యదర్శి ఇ.జయపాల్, సంయుక్త కార్యదర్శులు జి.మునెప్ప, నారాయణ, గ్యారేజ్ అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి జి.రహంతుల్లా, దిలీప్, అరుణ్, సురేశ్, నాయుడు, భాస్కర్, ఎంసీ.నాయక్, రాజా పాల్గొన్నారు.

## బాలికల కబడ్డీ విజేతలకు అభినందనలు



చౌడేపల్లె, అక్టోబర్30 (ఆంధ్రజ్యోతి) : అండర్-17 కబడ్డీ రాష్ట్ర విజేతలైన చిత్తూరు జిల్లా బాలికల జట్టును టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అభినందించారు. బుధవారం స్థానిక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం అందించే ప్రైజ్ మనీ రూ.25 వేలతోపాటు, సొంత నిధులు రూ.10 వేలను విద్యార్థులకు బహుకరించారు. బాలుర విభాగంలో రాష్ట్రస్థాయిలో నాల్గో స్థానం నిలిచిన బాలురను అభినందించి, బహుమతులు అందించారు. పారిశ్రామికవేత్త నవీన్‌కుమార్ దంపతులు క్రీడాకారులకు మెటీరియల్ అందించి అభినందనలు తెలిపారు. హెచ్ఎం నాగరాజరెడ్డి, పీఈటీ రాజేంద్ర, టీచర్లు పాల్గొన్నారు.

## కల్లూరులో దీపావళి సంబరాలు



కల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో మట్టి ప్రమిదలు వెలిగించి రంగవల్లికలతో ముందస్తు హరిత దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్‌కోర్ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు ప్రసంగించారు. పర్యావరణానికి హాని కలిగే విధంగా దీపావళి నిర్వహించరాదన్నారు.

## పుంగనూరులో సమస్యలు పరిష్కరించాలి

రొంపిచెర్ల, అక్టోబరు30: (ఆంధ్రజ్యోతి) పుంగనూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పుంగనూరు, సోమల, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు చెందిన పలువురు బుధవారం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కోరారు. పుంగనూరు పట్టణం, గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, పైపులైన్ తదితర అభివృద్ధి పనులు చేయాలని రూరల్ టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకుడు సీవీరెడ్డిలు కోరారు. రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, నాయకులు ఇమ్రాన్‌ఖాన్, కరీముల్లా, మదనమోహన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, పులిచెర్ల మురళీనాయుడు, వల్లిగట్ల విశ్వనాధం తదితరులు పాల్గొన్నారు.



145 రోజుల్లోనే

# చిత్తూరు చరిత్రను తిరగరాసిన జననేత గురజాల జగన్మోహన్

• 145 రోజుల్లోనే కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు • రాష్ట్రంలోనే అభివృద్ధికి దిక్సూచిగా చిత్తూరు నియోజకవర్గం • త్వరలో అడవిపల్లె ప్రాజెక్టు నుంచి చిత్తూరు ప్రజలకు త్రాగునీరు • జీజేఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు






పేదల పక్షాన పోరాడే తత్వం... ఆపదలో ఉన్నవారిని ఆదుకునే నైజం... సేవలకు నిలువెత్తు నిదర్శనం... చంద్రన్న సైనికుడిగా... మంత్రి నారా లోకేష్ ఆత్మీయుడిగా గురజాల జగన్మోహన్ స్థానం చిత్తూరు ప్రజల హృదయాల్లో పదిలం. ఆయన చిత్తశుద్ధి, విశ్వసనీయతలను గుర్తించి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు టీడీపీ అభ్యర్థిగా ఎంపికచేశారు. ఆయన నమ్మకాన్ని వమ్ముచేయకుండా జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రజల కష్టాలను కడతేర్చి జనం గుండెల్లో అభివృద్ధి, సంక్షేమం, సేవా కార్యక్రమాలను రెండు కళ్లుగా పాలిస్తూ రేపటితరాల ఉన్నతికోసం అహర్నిశలు శ్రమిస్తున్న దార్శనికుడు. చిత్తూరు రాజకీయ



చరిత్రను తిరగరాసిన ... చిత్తూరుకు వెలుగులు తెచ్చిన సూర్యుడు గురజాల జగన్మోహన్. దశాబ్దాలుగా ఎన్నడూ లేనివిధంగా చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యుడు గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులతో దూసుకు పోతుంది. రహదారుల విస్తరణ, పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ లాంటి ఎన్నో అభివృద్ధి పనులను చేస్తున్నారు. దీంతోపాటు జీజేఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. చిత్తూరు నియోజకవర్గ దశ, దిశ మార్చుతూ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా పాలన సాగిస్తున్నారు.






### ఎన్టీయార్ కీర్తి.... చంద్రబాబు స్ఫూర్తి

ఎన్టీయార్ ఆదర్శ రాజకీయం, ఆయన కీర్తి చంద్రబాబు స్ఫూర్తి.. నారా లోకేష్ తపన చూసే రాజకీయాల్లో వచ్చాను. పుట్టిపెరిగిన ప్రాంతం దశాబ్దాలుగా వెనుకబడి ఉంది. మూడు రాష్ట్రాలకు సరిహద్దున ఉన్న ఈ ప్రాంత అభివృద్ధి అయ్యేం దుకు అపార అవకాశాలు ఉన్నాయి. అయినా యువత ఉపా ధికోసం పొరుగు రాష్ట్రాల్లో స్థిరపడుతున్నారు. చిత్తూరును అభి వృద్ధి చేయాలని ఇక్కడే తల్లిదండ్రులతో స్థిరపడి ఉండాల నేదే నా ఆకాంక్ష అందుకోసం చిత్తూరులో పరిశ్రమలను స్థాపిం చేందుకు కృషిచేస్తున్నారు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్.

### తండ్రి ఆశయం మేరకే రాజకీయాల్లోకి..

తన తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు నుంచి సేవాగుణం, కష్టపడే తత్వాన్ని అలవరచుకుని తండ్రి సూచనల మేరకు వ్యాపారాల్లో మెళకువలు నేర్చుకోవడంతో పాటు మనతో పాటు అందరూ బాగుండాలనే తండ్రి ఆశయం మేరకు జీజేఎం ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి అనేక కార్యక్ర మాలు చేపట్టారు. తండ్రి ప్రోత్సా హంతో ప్రజాసేవ చేయడా నికి గురజాల జగన్మోహన్ రాజకీయాల్లో అడుగిడిన తొలి ప్రయత్నంలోనే గత సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గురజాల జగన్మోహన్ చిత్తూరు శాసన సభ్యులుగా అత్యధిక మెజారిటీతో గెలిచి అందరి అభిమానాన్ని చూరగొన్నారు.

### ఎమ్మెల్యేగా ఎన్నికైన ఒక్క నెలలోనే...

చిత్తూరు అభివృద్ధికి, మార్పుకు, బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ తనదైన నూతన శైలితో ప్రజల మన్ననలను పొందుతున్నారు. ఆయన నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలకు అతీతంగా అనేక మంది సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నారు.

### ఎమ్మెల్యేగా తొలి అడుగు..

చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచిన గురజాల జగన్మోహన్ నగర అభివృ ద్ధిపై దృష్టి సారించారు. నగరంలో నూతన కేంద్రీయ విద్యాలయ స్థాపనకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తొలి అడుగుపడింది. అందుకు సం బంధించి స్థలసేకరణ జరిగింది. ఇక పనులు మొదలు పెట్టాల్సిందే.

### రాష్ట్రంలోనే మొట్టమొదటి అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం

పేదల ఆకలి తీర్చడానికి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే మొట్టమొదటగా చిత్తూరులో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. త్వరలోనే మరిన్ని ప్రారంభించ డానికి ప్రతిపాదనలు పంపారు.

### త్వరలో అడవిపల్లె ప్రాజెక్టు నుంచి త్రాగునీరు...

గత 30 ఏళ్లుగా నగరాన్ని కమ్ముకున్న కరువు పీడనుంది. వేసవి వస్తుందంటే గుక్కెడు నీటికి తిప్పలుపడాలని ప్రజలు భయపడేవారు. సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతి నిధులు నానాపాట్లు పడేవారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా డిమాండ్‌కు అనుగు ణంగా నీటి సరఫరా చేయలేక విమర్శల పాలయ్యే పరిస్థితి ఉండేది. ముఖ్యంగా భూగర్భ జలమట్టం వెయ్యి అడుగులకు పడిపోవడంతో కొత్తగా బోర్ల డ్రిల్లింగ్‌కు ముందుకువచ్చేవారు కాదు. ఈ నేపథ్యంలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి, దాహార్తిని తీర్చేందుకు అమృత్ పథకం అనుసంధానంగా ఏషియన్ మౌళిక సదుపా యాల పెట్టుబడి బ్యాంకు (ఏఐఐబీ) అడవిపల్లె రిజర్వాయ ర్‌కు ఇచ్చిన నిధులతో పైపులైన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి చిత్తూరుకు నీరు అందించాల్సిందిగా దిశానిర్దేశం చేశారు. ఈ విషయమై పైపులైను పనులు ప్రారంభించాలంటే నేషనల్ హైవే అధికారుల అనుమతులు కావాలని అధికారులు కోరారు. అందుకు తగ్గ అనుమతులకు చర్యలు తీసుకుంటు న్నారు. అడవిపల్లె రిజర్వా యర్ ద్వారా 0.785 టీఎంసీ నీటిని చిత్తూరు ప్రాంతానికి త్వరగా కేటాయించాలని నీటి పారుదల మంత్రిని ఎమ్మెల్యే కోరారు. దామల చెరువు వద్ద 37 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ సైట్ సమస్యను పరిష్క రించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించి... ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నారు.

### చెరువుల సుందరీకరణ...

చిత్తూరు నియోజకవర్గంలో పలు చెరువుల సుందరీకరణకు నాంది పలికారు. గంగినేని చెరువు, కట్టమంచి చెరువులను అభివృద్ధి చేసి నగరంలో ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొ ల్పేందుకు తగుచర్యలు తీసుకుంటున్నారు. చెరువుల వద్ద మహనీయుల విగ్రహాలను ఏర్పాటుచేసి గంగినేనిపార్కులో సొంత నిధులతో హాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

### గ్రామీణ ప్రాంతాలకు మరిన్నీ ఆర్టీసీ సర్వీసులు

ప్రయాణికుల సౌకర్యార్థం చిత్తూరు 1, 2 డిపోల్లో నూతన ఆర్టీసీ బస్సులను 15 బస్సులకు పైగా రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించి భవిష్యత్తులో అధునిక సౌకర్యా లతో మరిన్నీ బస్సు సర్వీసులను ప్రారంభిస్తానని హామి ఇచ్చారు.

### మామిడి రైతులకు భరోసా...

చిత్తూరు నియోజకవర్గంలో మామిడి రైతుల కష్టాలను చూసి వారికి బాసటగా జిల్లా కలెక్టర్ నిర్దేశించిన ధరకే మామిడి కొనుగోలు చేయాల్సిందిగా నియోజకవర్గంలోని మామిడి గుజ్జు తయారీ పరిశ్రమ లను ప్రోత్సహిస్తున్నారు. గిట్టుబాటు అందేలా యాజమాన్యాలు రైతులకు మేలు చేయాలని ఆదేశించారు.

### జనంలో జీజేఎం

చిత్తూరు చరిత్రలో సంచనలనం. చిత్తూరు పురవీధుల్లో జనంలో జీజేఎం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు, అధికారులతో కలిసి ఆయా ప్రాంత వీధుల్లోకి వెళ్లి ఎన్నికల ప్రచారంలోనూ, ఇప్పుడు తన దృష్టికి వస్తున్న త్రాగునీరు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను చిత్తూరు నగరపాలక అధికారులకు వివరించి వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి సూచనలు చేస్తున్నారు. మరికొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.

### ఎన్టీయార్ భరోసా పంపిణీ

సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీయార్ భరోసా పథకం కింద పెంచిన పెన్షన్లను స్థానిక గాంధీనగర్‌లో లబ్దిదారుల ఇళ్లవద్దకే వెళ్లి అందించారు.

### అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరిక..

గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి చోటు చేసుకోలేదు. చిత్తూరు ఉమ్మడి జిల్లాపరిషత్ స్థాయి సమావేశంలో మొదటిసారిగా గళమెత్తారు. అదే స్ఫూర్తితో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఒక నెలలోనే చిత్తూరు అభివృద్ధి, మార్పుకు బాటలు వేస్తూ తనదైన నూతన శైలిలో ప్రజల మన్ననలను పొందుతూ ప్రత్యర్థి పార్టీకి చెందిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను ఆకర్షించి టీడీపీకి మద్ధతుపలికేలా చేశారు.

### చిత్తూరు పాత బస్టాండుకు పునరుజ్జీవం

చిత్తూరు పాత బస్టాండు, రైతు బజారును అధికారులతో కలిసి సందర్శించారు. పాత బస్టాండు స్థానంలో అధునాతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. రైతుబజారును పూర్తి స్థాయిలో ఆధునీకరించి అమ్మకాలు చేస్తున్న వారికి తన సొంతనిధుల నుంచి అద్దెలు చెల్లిస్తానని హామి ఇచ్చారు. సేంద్రియ పంటల ఉత్ప త్తులను విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చారు.

### ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా

నాడు వైసీపీ పాలనలతో సామాన్యులకు ఇసుక అందని పరిస్థితి నుంచిచంద్రబాబు ఇచ్చిన హామి మేరకు మండలంలోని పాలూరు, దిగువమాసాపల్లె రీచ్‌లో ఉమ్మడి పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఉచిత ఇసుక విధానంతో పేద ప్రజలకు మంచి రోజులు వచ్చాయని, భవన నిర్మాణ కార్మికులకు పనులు బాగుంటాయని అన్నారు.

### త్వరలో టిడ్కో ఇళ్ల పంపిణీ

చిత్తూరు నగర సమీపంలోని పూనేపల్లెలో నిర్మించిన మూడు వేల టిడ్కో ఇళ్లను సందర్శించి తన వద్దకు వచ్చిన సమస్యలను టిడ్కో లబ్దిదారులతో మాట్లాడారు. త్వరలో ఇళ్లను పంపిణీ చేసేందుకు శ్రీకారంచుట్టారు.

### ఈద్గాకు స్థలం కేటాయింపు

చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో ముస్లీంమైనార్టీల సౌకర్యార్థం ఈద్గా నిర్మాణానికి భూమి పూజ చేశారు.

### డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేనే స్వయంగా పాల్గొని నియోజకవర్గ ప్రజల సమస్యలను ఫోన్‌ద్వారా ప్రధానంగాతాగునీరు, శానిటేషన్, రోడ్లు, ఇంటి స్థలాలు, ఆరోగ్య సమస్యలను విని పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

### ప్రజా దర్బార్ ఏర్పాటు

చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 50 డివిజన్ల ప్రజలతో పాటు గుడిపాల, చిత్తూరు మండలాలకు చెందిన ప్రజలు సమస్యల పరిష్కారం కోసం లక్ష్మీనగర్ కాలనీలో ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ఉదయం హామీ... సాయంత్రానికి అమలు

నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. తాగునీటికి ఇబ్బందిగా ఉందని విద్యార్థులుచెప్పగా సాయంత్రానికి పాఠశాల ఆవరణలో కొత్త బోరును డ్రిల్లింగ్ చేసి హామినినెరవేర్చారు. అలాగే నియోజకవర్గంలో 15 పైగా కొత్త బోర్లను డ్రిల్లింగ్ చేయించారు.

### పరిశ్రమల ఏర్పాటుకు కృషి

చిత్తూరు యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడం కోసం బెంగళూరులో సామావేశమై చిత్తూరులో పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

### వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ. 51 లక్షల విరాళం

బోడికొండ శ్రీ వరప్రదాయ వెంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, అయన తండ్రి చెన్నకేశవులు నాయుడు రూ. 51లక్షల విరాళాన్ని ప్రకటించారు.

### విజయవాడ వరద బాధితులకు కోటి విలువతో నిత్యావసర సరుకుల పంపిణీ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబు ఆదేశాలమేరకు విజయవాడలోని 16వ డివిజన్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లోసహాయక చర్యల్లో పాల్గొన్న గురజాల జగన్మోహన్. బాధితులకు అదుకోవడం కోసం రూ. కోటికి పైగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. చిత్తూరు ప్రజలకు పిలుపునివ్వడంతో వారి అందించి న సరుకులతో పాటు జీజేఎం ఫౌండేషన్ విరాళంతో కలిపి మొత్తాన్ని పంపిణీ చేశారు.

### చీలాపల్లె సీఎంసీలో మెడికల్ కళాశాల ఏర్పాటు

గుడిపాల మండలంలోని చీలాపల్లెలో నిర్మితమైన సీఎంసీ ఆస్పత్రిలో కొత్తగా మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే చొరవ చూపించారు. ఈ క్రమంలో రూ. 500 కోట్లతో కళాశాల నిర్మాణానికి నిధులు విడుదలైనట్లు చెప్పారు. ఈ మేరకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు కలిసి ఆస్పత్రి నిర్వాహకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

### చిత్తూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు

మున్సిపల్ సాధారణనిధుల నుంచి రూ. 10 లక్షలతో బటీఈ కళాశాల సమీపంలో అన్నా క్యాంటీన్ ప్రారంభం. కోట్లాది రూపాయలతో 42 కొత్త బోరు బావుల డ్రిల్లింగ్. రూ. 20 లక్షలతో కార్పొ రేషన్‌లోని వివిధ ప్రాంతాల్లో మేజర్ డ్రైన్‌లో పూడికతీత కార్యక్రమ. రూ. 10 లక్షలతో పూర్తిగా పాడైపోయిన 14 మోటారు పంపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు. రూ. 50 లక్షలతో ఎంఎస్ఆర్ సర్కిల్ సమీపంలో మునస్వామి నాయుడు పార్కు అభివృద్ధి. రూ. 30 లక్షలతో అద్దెనీటి ట్యాంకర్లతో నీటి సరఫరా. రూ. 16 లక్షలతో మురకంబట్టు, ఇరువారం, గిరింపేట సర్కిళ్ల అభివృద్ధి. రూ. 12 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ డివైడర్లలో పచ్చదనం పెంపు. రూ. 20 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో సత్యనారాయణపురం నుంచి ఎల్‌బీ పురం వరకు అనుసంధానించే బీటీ రోడ్డు.

### నగరంలో చేపట్టబోయే పనులు

రూ. 33.90 కోట్ల అమృత్‌నిధులతో చిత్తూరు నగరం, హౌసింగ్ లే అవుట్లకు తాగునీటి సరఫరా చేయడం. ఎస్‌బీఎం 2.0 నిధుల నుంచి రూ. 236.04కోట్లతో మురుగు నీటి శుద్ధి కర్మాగారం నిర్మాణం. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని కంపోస్టు యార్డులో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు. రూ. 27 లక్షలతో హౌసింగ్ లే అవుట్లకు పచ్చదనం, నీటి నిర్వహణకు మూడు ట్యాంకర్ల నిర్మాణం. రూ. 10 లక్షలతో శాంతినగర్ కాలనీ పార్కు అభివృద్ధి. రూ. 13 లక్షలతో పుత్తూరు రోడ్డు వద్ద సెంట్రల్ లైటింగ్ అందించడం.

రూ. 27 లక్షలతో మురకంబట్టు నుంచి టబూన్ వరకు పచ్చదనాన్ని అందించడం. రూ. 2 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో శాహాహార,మాంసాహార మార్కెట్ల నిర్మాణం. ఎస్‌సీఏపీ నిధుల నుంచి రూ. 2కోట్లతో దర్గా సర్కిల్ నుంచి న్యూట్రిస్ వరకు రోడ్డు విస్తరణ సెంట్రల్ డివైడర్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

(Advt)

































## ఆరుతడి పంటలు సాగు చేయాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వరి పంటకు బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని ఏడీఏ శివకుమార్‌రాజు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వరి సాగు చేసుకునే రైతులు బోర్ల వద్ద ఎకర వరి సాగు బదులు 3ఎకరాలు ఆరుతడి పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. వరి సాగు చేసుకునే రైతులు నవంబరు చివరి వారంలో నారు పోసుకోవాల్సివుందన్నారు. రైతులు సబ్సిడీ కింద డ్రిప్ కోసం నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలు కోసం రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.



## కార్మికులకు యూనిఫాం పంపిణీ

పుంగనూరు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు యూనిఫాం, కొబ్బరినూనె, చెప్పులు అందజేసినట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వాలు మరిన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూధన్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో
## ఆయుధ పూజలు

సోమల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సోమల మండలంలోని ఆవులపల్లె, పేటూరు విద్యుత్ సబ్‌స్టేషన్లు, సోమల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయుధ పూజలు జరిపారు. కార్యక్రమాల్లో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్ఐ శివశంకర్, టీడీపీ నాయకులు ఉమాపతినాయుడు, శ్రీనివాసులు నాయుడు, రమేశ్‌నాయుడు, హెడ్ కానిస్టేబుళ్లు దేవరాజులు, నగేశ్, బాలచంద్ర, ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి, లైన్‌మెన్ విష్ణు వర్ధన్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.







## మండలాభివృద్ధికి సహకరించండి

చౌడేపల్లె మండల మీట్‌లో
జడ్పీటీసీ దామోదర్‌రాజు

చౌడేపల్లె, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని జడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పోలీస్ బందోబస్త్ మధ్య ఎంపీపీ రామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర రాజు మాట్లాడుతూ ప్రభుత్వం మారడంతో అధికారులందరూ కొత్తవారు వచ్చారని, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలసి మండలాభివృద్ధికి కృషి చేయాలన్నా రు. ఎంఈవో కేశరెడ్డి మాట్లాడుతూ..ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డులాగానే అపార్ ఐడీ ఇస్తున్నామని, ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు విద్యార్థి విద్యాపరమైన పూర్తి వివరాలు ఉంటాయన్నారు. నవంబర్ 14న మెగా పేరెంట్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ రామ్మూర్తి మాట్లాడతూ అధికారులు పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. ఏవో జ్యోతి మాట్లాడుతూ పీఎం కిసాన్ కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కొంతకాలంగా ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లు సక్రమంగా ప్రజలకు అందుబాటులో లేరని, ఆదివారం కూడా డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల మీట్ శాంతియుతంగా జరిగేందుకు పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ 20 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్త్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎస్ఐ వాసు, పోలీసులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీటీసీ దామోదర రాజు





## జీతాలు చెల్లించాలంటూ 108 సిబ్బంది నిరసన

పుంగనూరు రూరల్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని 108 వాహన సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షుడు మోగేశ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 108 వాహనాల ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని, వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

**రామకుప్పం :** జీతాలు అందకపోవడం పట్ల 108 సిబ్బంది రామకుప్పంలో బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తమకు సత్వరం జీతాలు అందించేలా 108 నిర్వహణ సంస్థ అరబిందో యాజమాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించాలని కోరారు.


పుంగనూరులో నిరసన తెలుపుతున్న 108 వాహన సిబ్బంది







## వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం

పలమనేరు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : దేశ సమగ్రతకు, సుస్థిరతకు స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర హోంమంత్రిగా పని చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు పేర్కొన్నారు. బుధవారం ఆ కళాశాలలో ఏక్‌తా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. సర్దార్ అడుగు జాడల్లో నడిచి దేశసుస్థిరతకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు ఏక్‌తా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. నందీశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్. వెంకటేష్‌బాబు, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి. నాగరత్నంరెడ్డి, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ టి. బాలాజి, ఇంగ్లీషు విభాగాధిపతి ఏ.సురేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల ఏక్‌తా ర్యాలీ

**సోమల :** సర్దార్ వల్లభాయి జయంతిని పురస్కరించుకుని సోమల జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ జరిపారు. కళాశాలలో ఆయన చిత్రపటానికి పూజలు జరిపి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు, అధ్యాపకులు గౌతం, వెంకటరమణ, శివయ్య విద్యార్థులు పాల్గొన్నారు.




## జీవో 117ను రద్దు చేయాలి

కల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థను దెబ్బతీసే జీవో నెంబరు 117ను వెంటనే రద్దు చేయాలని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి ఈశ్వర్‌మహేంద్ర డిమాండ్ చేశారు. పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం మండల యూటీఎఫ్ ఎన్నికలు నిర్వహించి అన్ని పదవులు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. మండల యూటీఎఫ్ నూతన అధ్యక్షుడిగా హరినాథరెడ్డెప్ప, సహాధ్యక్షులుగా వెంకటశివ, కళావతి, ప్రధాన కార్యదర్శిగా వి.యకుమార్, కోశాధికారిగా మహమ్మద్‌రఫి, జిల్లా కౌన్సిలర్లుగా ఈశ్వర్‌మహేంద్ర, హరినాధరెడ్డెప్ప, విజయ్‌కుమార్ ఎంపికైనట్లు వారు తెలిపారు.

## మొక్కల పెంపకంపై అవగాహన

పలమనేరు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా పలమనేరు సమీపంలోని టీఎస్ అగ్రహారం వద్ద ఉన్న నర్సరీలో మొక్కల పెంపకంపై అగ్రికల్చర్ ట్రైనర్ కర్నాటిఅభిలాష్ వివరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ట్రయినర్ శివశంకర్‌రుద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రామకుప్పం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బందార్లపల్లె చెరువుకట్టపై బుధవారం ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం మేరకు ..వి.కోట మండలం పట్రపల్లెకొత్తూరుకు చెందిన సురేంద్ర(21), రామకుప్పం మండలం పంద్యాలమడుగుకు చెందిన భాస్కర్(14)లు బుధవారం పంద్యాలమడుగు నుంచి ద్విచక్రవాహనంలో రామకుప్పం బయలుదేరారు. పల్లెకుప్పానికి చెందిన హేమాద్రి(21) ద్విచక్రవాహనంలో రామకుప్పం నుంచి పల్లెకుప్పంకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బందార్లపల్లె చెరువుకట్టపై ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భాస్కర్, సురేంద్ర, హేమాద్రికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రులను కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు.









## బహుమతుల ప్రదానం



కానిస్టేబుల్ హరీష్‌కు బహుమతిని ప్రదానం చేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా పోలీసు పిల్లలు, విద్యార్థులు, పోలీసులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన వారికి మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు బహుమతులను ప్రదానం చేశారు. ఈ నెల 26వ తేదీన సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర-ప్రస్తుత వాతావరణంలో పోలీసులకు సవాళ్లు అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందినవారికి పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రథమ బహుమతి కింద రూ.5వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.3వేలు, తృతీయ బహుమతి కింద రూ.2వేల నగదు అవార్డులను ఎస్పీ అందించారు. వక్తృత్వ పోటీలో కాణిపాకం కానిస్టేబుల్ హరీష్ ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు.

## విద్యాసంస్థల్లో దీపావళి సంబరాలు



విజయం విద్యాసంస్థల్లో



హార్వర్డ్ స్కూల్లో



న్యూయార్క్ స్కూల్లో..

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, డైరెక్టర్ శైలజమూర్తి ఆధ్వర్యంలో దీపావళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థినుల శాస్త్రీయ నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్, డైరెక్టర్ త్రివేణి ఆధ్వర్యంలో విద్యార్థులు దీపావళి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక న్యూయార్క్ స్కూల్లో విజ్ఞానసుధ విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నారాయణ'లో ముందస్తు దీపావళి



నగరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ పాఠశాలలో బుధవారం ముందస్తు దీపావళి సంబరాలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. నరకాసుర సంహారాన్ని గుర్తు తెచ్చుకునేలా దీపాలు వెలిగించి విచిత్ర వేషాలలో విద్యార్థులు అలరింపజేశారు.

## డ్రైనేజీల పరిశీలన

గంగాధరనెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూగుండ్రంలో పలు వీధుల్లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజి వ్యవస్థను ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసులు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీటిపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఏఈ ఈశ్వర్, పంచాయతీకార్యదర్శి మురళి, సర్పంచ్ శ్రీబాబు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ రాజీనామాతో వైసీపీకి ఇబ్బందేమీ లేదు

ఐరాల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఐరాల మండల జడ్పీటీసీ సుచిత్ర రాజీనామా చేసి ఏ పార్టీలో చేరినా వైసీపీకి ఎలాంటి ఇబ్బంది లేదని నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవిరెడ్డి, చిన్నారెడ్డి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ వైసీపీ గుర్తుపై గెలిచిన ఆమె ముందు వైసీపీకి రాజీనామా చేయాలన్నారు. జడ్పీటీసీగా ఆమె కొనసాగడానికి తాము ఒప్పుకోమన్నారు.

## ఘనంగా రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బుధవారం భక్తులు సాయిలింగేశ్వరస్వామికి భక్తి ప్రపత్తులతో రుద్రాభిషేకం చేశారు.

## రైతులకు సాంకేతిక పరిజ్ఞానం

వెదురుకుప్పం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల సాగు ఖర్చులు తగ్గించి, అధిక ఆదాయం పొందే విధంగా సాంకేతిక పద్ధతులను అందించడమే లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ అన్నారు. బుధవారం వెదురుకుప్పం మండలం చవనపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి హాజరయ్యారు. ఏవో వనిత, సిబ్బంది హాజరయ్యారు. కార్వేటినగరం మండలం ఆలత్తూరు, కార్వేటినగరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

## టపాసుల విక్రయ కేంద్రాల పరిశీలన

నగరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని నగరిలో ఏర్పాటు చేసిన టపాకాయల విక్రయ కేంద్రాలను బుధవారం సీఐ మహేశ్వర్ తనిఖీ చేసి, జాగ్రత్తలు పాటించాలని విక్రయదారులను హెచ్చరించారు.

## యూటీఎఫ్ ర్యాలీ

నగరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్)స్వర్ణోత్సవ సంబరాల ర్యాలీని నగరి ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు అసోసియేషన్ సభ్యులు నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హెల్మెట్లు ధరించకపోతే జరిమానా: ఎస్పీ మణికంఠ


హెల్మెట్ పంపిణీలో పాల్గొన్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వాడకం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదు.. వ్యక్తిగత రక్షణ అని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. బుధవారం పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ మురళి తన సొంత నిధులతో సమకూర్చిన హెల్మెట్లను ఎస్పీ సమక్షంలో జిల్లాలోని 30 మంది హోంగార్డులకు పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో పాటు పోలీసులు కూడా తప్పనిసరిగా హెల్మెట్లు వాడాలని, ధరించని వారికి జరిమానా విధిస్తామని స్పష్టంచేశారు. హెల్మెట్లను అందించిన మురళిని ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ శివానంద కిశోర్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

In the court of the V[th] Addl. Junior Civil Judge: Tirupati
O.S.No.229/2019

State bank of India, RASMECC & SARC, Tirupati Rep by its Chief Manager ... Plaintiff

Vs.

Smt. T.Varalakshmi,
T.Naveen Kumar ...Defendants

SUIT SUMMONS TO THE DEFENDANT NO.2

T.Naveen Kumar S/o. T.Amarnath Shetty, D.No. 1-92, Bazar Street, Puthalapattu Post & Mandal, Chittoor district.

The plaintiff filed the above suit against the defendants for recovery loan amount. Rs.3,58,320/- with interest. The suit is posted to 4-12-2024 for your appearance. You shall appear on 4-12-2024 at 10.30 am before the above said court in person or by advocate, If you fail to do so the suit will be decided in you absence.

N.MANOHAR M.A, B.L.,
Advocate, Tirupati, Cell: 9346981333

## ఆర్డీవోకు సన్మానం

నగరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన భవానీశంకరిని బుధవారం ఎంపీడీవో సతీష్, పంచాయతీరాజ్ డీఈఈ సుబ్బరాయుడు, ఏఈ వీరభద్రంలు సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే థామస్ శుభాకాంక్షలు

వెదురుకుప్పం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన శుభప్రదమైన దీపావళి పండుగ రోజున ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ బుధవారం తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐటీసర్వ్ అలయన్స్ 2024 కాన్ఫరెన్స్‌లో నగరి ఎమ్మెల్యే



నగరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని లాస్‌వేగాస్‌లో నిర్వహించిన ఐటీసర్వ్ అలయన్స్ 2024 కాన్ఫరెన్స్‌లో మంత్రి నారా లోకేష్‌తోబాటు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. అమెరికా వాసులు ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ పరిశ్రమలు నెలకొల్పేలా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా అమెరికాలో జరుగుతున్న కాన్ఫరెన్స్‌లలో భానుప్రకాష్ పాల్గొన్నారు.

## యూత్ ఫెస్టివల్‌పై అవగాహన

వెదురుకుప్పం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం యూత్ ఫెస్టివల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్వీ విశ్వవిద్యాలయం కల్చరల్ కో-ఆర్డినేటరు డాక్టర్ పి.వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నలత, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


## జనసేన ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే

పెనుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సామిరెడ్డిపల్లి ఎస్టీ కాలనీలో బుధవారం జనసేన ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఇక్కడి ప్రజలకు ఆధార్, రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని జనసేన మండలాధ్యక్షులు శ్రీనివాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీ వాణి, సెక్రటరి లాంచన, వీఆర్వో రేవతి, జనసేన నాయకులు ప్రసాద్, బాలాజి, రేణుక, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## అట్టడుగు వర్గాలకు సేవే ఈశ్వర్ నాయుడి లక్ష్యం

- 30 ఏళ్లుగా సామాజిక సేవలో రాణింపు
- గ్రామీణ ప్రాంతం నుంచి పారిశ్రామికవేత్తగా ఎదిగిన వైనం
- రాజకీయాలతో మరింత సేవ చేయాలనే తపన
- 2009 'ఈశ్వర్ అభయ ట్రస్టు' ఏర్పాటు







30 ఏళ్లుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ.. విద్య, వైద్య రంగాలకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. 'పారిశ్రామికవేత్తగా కొందరికే సేవ చేయొచ్చు.. రాజకీయాల ద్వారా అయితే ఎందరికో సేవ చేయొచ్చ'ని భావిస్తున్న ఈశ్వర్ నాయుడు జిల్లా ప్రజలకు సుపరిచితమే.

**అంచలంచెలుగా ఎదిగి**

పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం బొమ్మాయిపల్లె గ్రామానికి చెందిన ఈశ్వరనాయుడు ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. వ్యాపారవేత్తగా, బిల్డర్‌గా, పారిశ్రామికవేత్తగా అంచలంచెలుగా ఎదిగారు. ఏ స్థాయికి ఎదిగినా సొంత గడ్డను మరవకుండా జిల్లాలోని పలు ప్రాంతాల్లో 30 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2009లో 'ఈశ్వర్ అభయ ట్రస్టు' ఏర్పాటు చేసి అనేక మందికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

**• వివేకానంద, ఎన్టీఆర్, చంద్రబాబు స్ఫూర్తితో..**

స్వామి వివేకానంద, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు స్ఫూర్తితో ఈ స్థాయికి ఎదిగానని ఈశ్వర్‌నాయుడు అంటున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం వారితోనే అలవాటు చేసుకున్నారు. వారి నుంచి అలవరచుకున్న లక్షణాలే మానవతావాదిగా మార్చినట్లు చెప్పుకుంటున్నారు.



**• విద్యా రంగానికి సేవలు..**

బంగారుపాళ్యం, మొగిలి, పలమనేరు, పూతలపట్టు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తూ, మెరుగైన విద్యాభ్యాసం కోసం పుస్తకాలు, ఫీజులు, స్టేషనరీ వంటివి పంపిణీ చేస్తున్నారు. ఆయా పాఠశాలల అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు.

**• వైద్య రంగంలో..**

రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ప్రముఖ వైద్య సంస్థల్లోని డాక్టర్లతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కరోనా సమయాల్లో జిల్లాతో పాటు బెంగుళూరులోనూ కొవిడ్ కిట్లను పంపిణీ చేశారు.

**• ఆధ్యాత్మిక రంగంలో..**

పలు పురాతన ఆలయాలకు జీవనోద్ధరణతో పాటు 30 ఏళ్లుగా మొగిలి గ్రామంలోని మొగిలీశ్వర ఆలయానికి ప్రతి ఏడాదీ రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**• సాయం కోసం ఎల్లప్పుడూ సిద్ధం..**

పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు, విద్యార్థులకు కుల మతాలకు అతీతంగా సాయం చేసేందుకు మా ట్రస్టు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన అంటున్నారు.

**• విస్తృత పరిచయాలు..**

చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, పీలేరు, పలమనేరు, బంగారుపాళ్యం, మొగిలి, వి.కోట, కుప్పం, పుంగనూరు, మదనపల్లె తదితర ప్రాంతాల్లో లోతైన పరిచయాలున్నాయి. బంధువర్గం, మిత్ర వర్గం ఉంది. అలాగే సౌత్ బెంగుళూరులోని సర్జాపూర్, పద్మనాభనగర్, జయనగర్ ప్రాంతాల్లో ఈశ్వర్‌నాయుడు అంటే తెలియనివారు లేరు.

**• రాజకీయ అనుభవం..**

వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా అంచలంచెలుగా ఎదిగిన ఈశ్వర్‌నాయుడికి రాజకీయ అనుభవం కూడా ఉంది. గతంలో చిత్తూరులో ఎమ్మెల్యే సత్యప్రభ, ఎంపీ శివప్రసాద్, పీలేరు కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసమే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని పద్మనాభనగర్, సౌత్ బెంగుళూరులోని బీజేపీ అభ్యర్థులు అశోక్, కృష్ణప్పల గెలుపు కోసం కృషి చేశారు. వారి ఎన్నికల ప్రచారాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2014 ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేశారు.

**• 3 వేల మందికిపైగా ఉపాధి..**

నిర్మాణ రంగంలో జీఆర్ కన్‌స్ట్రక్షన్, శ్రీ ఇండస్ట్రీస్, శ్రీ బ్లూ మెటల్స్ సంస్థలను ఏర్పాటు చేసి 250 మంది రెగ్యులర్ ఉద్యోగులకు, 3 వేల మందిపైగా కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్నారు. 25 ఏళ్లుగా జీఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్థాపించి 11 ప్రాజెక్టుల్లో, 45 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణాలు పూర్తి చేశారు. దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ కంపెనీగా నిలిచింది




(Advt)







